# రచయితనుండి గమనిక: విలపించునట్లు నిన్ను చేసేది ఏది?

ఒకనికి కన్నీళ్లు తెచ్చేది (లేక తేనిది) అది హృదయపు వ్యాఖ్యానాన్ని స్పష్టంగా కనుపరచుతుంది. తమ కన్నీళ్లలో ఉండే ఉప్పు ఖరీదు కూడ చేయని విషయాలను గూర్చి జనులు తరుచుగా ఏడ్చుతూ ఉంటారు. దుఃఖాన్ని రేకెత్తించవలసిన పరిస్థితులను అలక్ష్యం చేసి నవ్వుతూ ఉంటారు.

ఒక దేశము తన వీపును దేవునివైపుకు త్రిప్పుట చూచి కన్నీళ్లు విడువక ఉంటామా? నైతిక ఆత్మ సంబంధమైన సంపూర్ణతలు మృతిచెందుచుండగా విచారము లేకయే మనము వాటిని చూస్తూ ఉంటామా? దేవుని ఎరుగలేక పోవడం కంటె, లోక సంబంధమైన విజయం సాధించలేక పోయామన్న దానికి ఏడ్చే అవకాశం ఎక్కువగా ఉండునట్లు భద్రత అనే వలయంలో మనం చిక్కుకొనిపోయి ఉండవచ్చా?

ఏది ఎక్కువ అక్కరగా ఉండాలో తరచుగా అది అక్కరగా ఉండదని గుర్తించడానికి విలాపవాక్యములు మనకు సహాయం చేస్తుంది. మత జీవితాల్లోనుండి దేవుని ప్రజలు దేవుని విడిచి, దేవుని ఎరుగని జనుల పొత్తునందు నమ్మికయుంచి, తమ జీవితాలు ఎంత గొప్పవో  అని ఉబ్బించిన అబద్ధ ప్రవక్తల మాటలనాలకించినందుకు యిర్మీయా విలపించాడు. అతని కన్నీళ్లు దేవుని కన్నీటికి ప్రాతినిధ్యం యిచ్చాయి. తన ప్రజలు తనను విసర్జించినందుకు హృదయం పగిలిన దేవుని కన్నీళ్లను అవి సూచిస్తాయి.

యిర్మీయావలె, యెరూషలేమును గూర్చి ప్రభువైన యేసు విలపించారు (లూకా 19:41). యెరూషలేము పతనానికి ముందే యిర్మీయా విలపించాడు. ఎందుకంటె, జనుల జీవిత విధానం వారిని ఎక్కడికి తీసికొనిపోతుందో అతనికి తెలుసు. యెరూషలేము తిరిగి నాశనం చేయబడుతుందనే సంగతి ప్రభువువారికి తెలుసు. వారు దానికి సిద్ధపడియుండరని కూడ ఆయనకు తెలుసు. "– నీవును ఈ నీ దినమందైనను సమాధాన సంబంధమైన సంగతులను తెలిసికొనినయెడల నీ కెంతో మేలు, గాని యిప్పుడవి నీ కన్నులకు మరుగుచేయబడియున్నవి. (ప్రభువు) నిన్ను దర్శించిన కాలము నీవు ఎరుగకుంటివి గనుక నీ శత్రువులు నీ చుట్టు గట్టు కట్టి ముట్టడివేసి, అన్ని ప్రక్కలను నిన్ను అరికట్టి, నీలోనున్నవి పిల్లలతో కూడ నిన్ను నేల కలిపి నీలో రాతిమీద రాయి నిలిచియుండనియ్యని దినములు వచ్చునని" చెప్పినప్పుడు ఆయన కన్నులలోనుండి నీళ్లు ఉబికి యుండవచ్చు (లూకా 19:42-44).

విలాపవాక్యముల గ్రంథంలో నేడు మనకున్న సందేశమేమి? నేడు మన దేశముల పరిస్థితులను బట్టి మనం కూడ విలపించుతూ ప్రార్థిస్తూ ఉండాలా? నేడు సంఘములలో చోటుచేసికొన్న పాపమును గూర్చి ఏడ్చుతూ ప్రార్థిస్తూ ఉండాలా? మనలను మనం పరీక్షించుకొనడానికి విలాపవాక్యముల పఠనము మనకు సహాయపడుతుంది. పాపము విషయమై దుఃఖపడుతూ, ప్రజలు దేవుని యొద్దకు తిరిగి రమ్మని కోరవలసిన అవసరతను మనం గుర్తించవచ్చు. తప్పు చేసినందుకు లేక అలక్ష్యం చేసినందుకు మనం బాధపడు తున్నట్టయితే, మనకు సహాయపడే నిరీక్షణకు ఒకే మూలము నొద్దకు ఈ స్టడీ మనలను నడిపించగలదు.